# ముగింపు

శ్రీమతి న్యాయపతి కమలారాంజి

మాధవి హాస్పిటల్‌లో బెడ్ మీద వుంది. అందమైన ఆమె ముఖం మీద ఎవరో యాసిడ్ పోశారు. ముఖమంతా నిప్పులమీద కాల్చిన వంకాయలా వుంది. ఒక్క కళ్ళు తప్ప మిగతా ముఖమంతా వికృతంగా తయారైంది. ఏడవవద్దని ఎవరెంత చెప్పినా వినకుండా కుళ్ళి కుళ్ళి ఏడుస్తోంది మాధవి.

జరిగిన ఘోరం విని నేను మాధవిని చూడ్డానికి హాస్పిటల్‌కి వెళ్ళాను. మాధవి నా స్టూడెంట్. నేను కొత్తగా ఆ కాలేజీలో చేరాను. మాధవికి నేనంటే చాలా గౌరవం ఉంది. పైగా నేను స్త్రీ జనోద్ధరణ సంఘం సభ్యురాలిని. అందుకే అసలేం జరిగిందో, అంతలా ఆమె మీద యాసిడ్ పోసి ఆమెని ఆ స్థితికి తీసుకురావడానికి అసలైన కారణమేమిటో తెల్సుకుందామని వెళ్ళాను. వీలైతే ముఖ్యంగా ఆమెకొక సలహా ఇవ్వాలనే ఆలోచన కూడా వుంది.

నన్ను చూసి మాధవి పాపం ఏడ్చేసింది. ఒక్క ముఖమే కాదు ఆ యాసిడ్ ప్రభావం వల్ల పాపం ఆమె చేతులు, మెడ కూడా బాగా



కాలిపోయాయి. నాకు చెప్పలేనంత జాలి వేసింది. కొంతసేపు ధైర్యం చెబుతూ మంచి మాటలతో ఆ అమ్మాయిని ఓదార్చాలని ప్రయత్నించాను.

"అసలెందుకిలా జరిగింది మాధవీ? నీ మీద అంత కోపం, కసి ఎవరికున్నాయి?" అడిగాను.

"మేడమ్! ఒక విధంగా నాకు తగిన శాస్తే జరిగింది" అంది ఏడుస్తూ.

"ఛ... తప్పు. అలా మాట్లాడకు మాధవీ!"

"లేదు మేడమ్. నా గురించి నేను కొంత చెప్పుకుంటేనే గాని నాకు ఊరట, శాంతి లభించదు. నాకు మీరంటే గౌరవం, అభిమానం వున్నాయి. నా మనసుని మీ ముందు విప్పి చూపిస్తేనే నాకు నిజమైన మనశ్శాంతి లభిస్తుంది" అంటూ మొదలుపెట్టింది.

* * *

నేను అందంగా వుంటాను. అందంగా వుంటాననే గర్వం కూడా వుంది. నలుగురూ నన్ను చూసి "నువ్వు చాలా అందంగా వుంటావు" అని అనడంతో నా అందం మీద నాకు చాలా నమ్మకం కలిగింది. "నువ్వు పూర్వజన్మలో ఏ గంధర్వ కన్యవో అయి వుంటావు. లేకపోతే ఇంత అందం మానవమాత్రులకు సాధ్యంకాదు" అని నా స్నేహితురాళ్ళంటూ వుంటారు.

"మీ అమ్మాయి అప్సరసలా వుంటుంది. మీ అమ్మాయి కోసం ఏ రాకుమారుడిలాంటి వాడో తపస్సు చేస్తూ వుండి వుంటాడు" అని ఇరుగుపొరుగు వాళ్ళు అమ్మతో అంటే విని నేను పొంగిపోతూ వుండేదాన్ని. నన్ను గురించి నేను ఎలా వర్ణించుకోను? అయినా నా అందం ఒక్క ముఖానికే పరిమితం కాలేదు. అందమైన మెడ వంపులో, నడుం మడతల్లో, పిరుదుల కదలికల్లో అందమైన నా అందం బహిర్గతమవుతూనే ఉంటుంది. ఒకసారి నన్ను చూసిన ఏ మగాడైనా పదే పదే నన్ను తిరిగి చూస్తాడు. నా అందాలు, అవయవ సంపద స్త్రీని అంగాంగ వర్ణన చేసే శ్రీనాధుని కావ్యాల్ని గుర్తుకు తెస్తాయని కాలేజీ కుర్రాళ్ళు ప్రేమలేఖల్లో తెలియజేసేవారు. కాలేజీకి వెళ్తే పాఠం చెబుతున్నంత సేపూ మగ లెక్చరర్లు నా వైపే చూసేవారు. ఊహ తెల్సినప్పటి నుంచి అద్దం ముందు నించుని నా అందానికి మెరుగులు దిద్దుకోవడమే నా ముఖ్యమైన పని. అలాగని చదువు అశ్రద్ధ చేయలేదు. ఇప్పటి ధాకా మంచి మార్కులతోనే పాసవుతూ వచ్చాను. నాతో స్నేహం చేయాలని, కనీసం నాకు దగ్గరగా వచ్చి కూర్చుని నాతో మాట్లాడాలని, నాతోటి అమ్మాయిలంతా తహతహలాడిపోతూ వుండేవారు. ఇహ అబ్బాయిల సంగతి చెప్పనక్కర్లేదు. పురుగుల్లా నా చుట్టూ తిరిగేవారు.

నాకు భలే తమాషాగా అనిపిస్తూ వుంటుంది. ఎవరైనా రోడ్డుమీద అందవిహీనులు కనిపిస్తే "అసలు దేవుడు ఇలాంటివాళ్ళని ఎందుకు పుట్టించాడు? అందంలేని ఇలాంటి వాళ్ళ బ్రతుకులు వ్యర్థం కదా!" అనుకునేదాన్ని నేను. మన కాలేజీలో వనజ అనే అమ్మాయి వుంది. నల్లగా, ఎత్తుపళ్ళు, చిన్న ముక్కు, చీమకళ్ళు, పొట్టిగా, పరమ అసహ్యంగా వుంటుంది. వనజ నాతో చాలాసార్లు మాట్లాడాలని ప్రయత్నించింది. నా ప్రాణ స్నేహితురాలు స్వప్న నాతో అంది. "మాధవీ! ఆ ఏ.పి. (ఎత్తుపళ్ళ వనజకి మేం ముద్దుగా పెట్టుకున్న పేరు) నీతో మాట్లాడాలని తెగ ఉబలాట పడిపోతోందే పాపం! ఒక్కసారి కరుణించి కటాక్షించవే మహాతల్లీ!" అని. నేను నవ్వాను. వెటకారంతో కూడిన నవ్వు. నాలాంటి అందమైన అమ్మాయితో మాట్లాడ్డానికి తనకెన్ని గుండెలుండాలి. నా పక్కన నించోవడానికే అర్హత లేదు. క్లాసులో నా పక్కన కూర్చునేందుకు అమ్మాయిలు పోటీపడేవారు. కాని స్వప్న, జ్యోతిని మాత్రమే నాకు ఇరువైపులా కూర్చునేదాన్ని. వాళ్ళకి నా అంత అందం లేకపోయినా ఏదో ఫర్వాలేదనిపించే అందం వుంది. ముఖ్యంగా నన్ను, నా అందాన్ని ఇరవై నాలుగ్గంటలూ పొగుడుతూ కూర్చునే ఓపిక వాళ్ళిద్దరికే వుంది. అందుకే వాళ్ళిద్దరికే నా పక్కన చోటిచ్చాను. మేం ముగ్గురం ప్రేమ, పెళ్ళి, భర్త, పిల్లలు, సంసారం, మోడలింగ్, సినిమాలు... ఇలా ఎన్నో విషయాల మీద నోటికొచ్చినట్టు సరదాగా మాట్లాడుకునే వాళ్ళం.


స్వప్న అనేది "పెళ్ళి అంటే ఈ రోజుల్లో వ్యాపారం అయిపోయింది. లక్షలకి లక్షలు కట్నాలు ఇస్తేగాని డాక్టర్లు, ఇంజనీర్లు దొరకరు! అందం, ఐశ్వర్యం, చదువు అన్నీ వుండాలి మళ్ళీ!" అని.

జ్యోతి అనేది "ఏమోనే! మన మాధవిది విలక్షణమైన, అద్వితీయమైన అందం. దాని విషయంలో కూడా ఇలాగే ఉంటుందంటే నేను నమ్మను".

నేను అనేదాన్ని గర్వంగా, "నన్ను ఏ మగాడైనా, వాడు ఐ.ఏ.ఎస్. ఆఫీసరు అవనీ, ఇంజనీరవనీ, డాక్టరవనీ, ఎవరవనీ .... నాకే తిరిగి కట్నం ఇవ్వాల్సిందే పెళ్ళి చేసుకోవాలంటే!"

ముగ్గురం నవ్వుకునేవాళ్ళం.

అయితే ఈ మధ్య కొన్నాళ్ళుగా నన్ను ప్రేమిస్తున్నానంటూ ఒకడు నా వెంట పడుతున్నాడు. వాడి పేరు జయరాం అట. వాడ్ని వదిలించుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేశాను. నేనెక్కడికి వెళితే అక్కడికి నా వెనకే వచ్చేవాడు. నల్లగా, పొడవుగా వుంటాడు. వాడి మొహం చూస్తే చాలు నాకు డోకొచ్చినంత పనయ్యేది.



రోజురోజుకీ వాడి గొడవ ఎక్కువైపోయింది. ఒక రోజు నేను కాలేజీ నుంచి వస్తుంటే కాలేజీ క్యాంపస్‌లోనే వాడు ఎదురుపడి హఠాత్తుగా చేయి పట్టుకుని ముద్దు పెట్టుకున్నాడు. అప్పటికే అందరూ మూగిపోయారు.

"నేను గాఢంగా ప్రేమిస్తున్నాను. నువ్వు నా ప్రేమని నిరాకరిస్తే...."

"ఆఁ.. ఏం చేస్తావు?" విసురుగా అన్నాను.

"నా ప్రేమని నిరాకరిస్తే నిన్ను చంపి నేను చచ్చిపోతాను" అన్నాడు జయరాం.

వెంటనే నా చేయి గాల్లోకి లేచింది. గబగబా ముందుకు వచ్చి వాడి కాలర్ పట్టుకుని చెంపమీద నాలుగు వేళ్ళు అంటుకునేలా ఒక్క లెంపకాయ ఇచ్చాను.

"యూ... ఈడియట్, స్కౌండ్రల్... ఎప్పుడైనా నీ మొహం అద్దంలో చూసుకున్నావా? నీ లాంటి దేభ్యం మొహం గాడికీ ప్రేమ కావాల్సొచ్చిందా? ఛీ! నీ మొహం ఇంకెప్పుడూ నాకు చూపించకు. నువ్వు ఈసారెప్పుడైనా నాకు కనిపించావంటే నేనేం చేస్తానో నాకే తెలీదు. నువ్వు చచ్చిపోతావా? చచ్చిపో. ఎవరూ అడ్డుపెట్టరు. పైగా సంతోషిస్తారు!" అని బాగా తిట్టి, నోటికొచ్చినట్లు మాట్లాడి వచ్చేశాను.

ఆ తర్వాత ఒకరోజు రాత్రి నేను వంటరిగా ఇంటికి వస్తుంటే దారిలో వాడు... ఆ రాస్కెల్ సడెన్‌గా నా ముఖంమీద యాసిడ్ పోసి మెరుపులా మాయమయ్యాడు...." చెప్పడం ఆపి వెక్కివెక్కి ఏడ్వడం మొదలుపెట్టింది మాధవి.

"అయితే ఇప్పుడేం చెయ్యాలనుకుంటు న్నావు?" అడిగాను.

"వాడిమీద కంప్లయింట్ ఇస్తాను. వాడి అంతు చూస్తాను" కసిగా అంది మాధవి. నేను కొంతసేపు మౌనం వహించాను. తర్వాత నెమ్మదిగా అన్నాను. "మాధవీ! బాగా ఆలోచించు. ఇందులో నీ తప్పేమీ లేదంటావా? నువ్వు అతన్ని రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించావు. నువ్వు చాలా అందమైనదానివన్న అహంభావంతో అతన్ని నలుగురిలో ఘోరంగా అవమానించావు. తట్టావు, అతనేం గొప్ప వ్యక్తి కాదు కదా! క్షమించి వదిలిపెట్టడానికి! అతని అహం దెబ్బతింది. కోపంలో మనిషి వివేకం కోల్పోతాడు. వివేకం కోల్పోయినవాడు వింతమృగంలా ప్రవర్తిస్తాడు. ఆ తర్వాత ఆకులు పట్టుకున్నట్టు అవుతుంది. అతనిప్పుడు ఎంతగానో పశ్చాత్తాపం చెందుతున్నాడేమో? ఎవరికి తెలుసు?" అన్నాను ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

వెంటనే జవాబివ్వలేదు మాధవి. ఏదో దీర్ఘంగా ఆలోచిస్తోంది. మళ్ళీ నేనే గొంతు విప్పాను. "నువ్వు పోలీసు రిపోర్టు ఇచ్చినంత మాత్రాన నీ పూర్వపు అందం నీకు తిరిగి రాదు. పైగా పరువు కూడా పోతుంది. ఈ పరిస్థితుల్లో పెళ్ళి అవ్వడం కూడా కష్టమే!"

"అయితే నన్నేం చేయమంటారు మేడమ్?"

"వాడేదో క్షణికోద్రేకంలో అలా చేసి వుండవచ్చు. అతనికి నీ మీద పిచ్చి ప్రేమ ఉందన్న మాట వాస్తవం తెలుస్తోంది. తనకి దక్కని అందం మరెవ్వరికీ దక్కకూడదని అలా చేశాడనిపిస్తోంది."

## పాయసం పద్యాలు

### అందం - మనసు!

అందం, రూపురేఖా విలాసం బహుమానం
భగవంతుడిచ్చిన వరం, పుణ్యఫలం
అందానికి మించి మనసు మహోన్నతం
అందం కిరీటమైతే మనసు సింహాసనం!

### అడవిదొంగ!

అడవిదొంగ వీరప్పన్ నమ్ముతాడు దైవాన్ని
దేవుడి దయ వున్నట్లుంది కనుక్కోలేరతని వైనాన్ని
అడవి జీవితం దుర్భరం, మలచుకున్నాడు మార్గం
అందువల్లే అణువణువూ అతనికి స్వంతం,
స్వర్గం!

### మోడరన్ గడ్డాలు

ఫ్యాషనైంది యువతకు పెంచడం గడ్డాలు
పేలోకవైపు, అడవి, మరి ఇంతికి అడ్డాలు
బార్బరోళ్ళకు గిరాకీ తగ్గి, కలిగె నష్టాలు
మనమేం చేయగలం అవి వారి ఇష్టాలు!

✳ ✳ ✳

గడ్డం అడ్డమే ఆడవాళ్ళకు పైగా
ఫ్యాషనైంది మగాళ్ళకు సొగ్గా
గిరాకీ తగ్గింది కొందరికి, విసుగ్గా
వున్నా భరిస్తున్నారు యువత క్లాసిగ్గా!

**- పాయసం సుబ్రహ్మణ్య మహర్షి**

మాధవి అనుమానంగా నా వైపు చూసింది.

"అతనికి నీమీద నిజమైన ప్రేమే కనుక వుంటే నిన్నీ స్థితిలో కూడా వివాహం చేసుకునేందుకు ముందుకు వస్తాడు. బై ది బై అతను చాల ఆస్తిపరుడని, అతని తండ్రికి కోట్ల ఆస్తి వుందని, అతను ఒక్కడే కొడుకని విన్నాను..."

నమ్మలేనట్టుగా మొహం పెట్టింది మాధవి. అయినా నాకేం పట్టనట్టుగా మళ్ళీ చెప్పడం మొదలెట్టాను. "అతను నిన్ను పెళ్ళి చేసుకుంటానని అంటే నువ్వు అతన్ని పెళ్ళి చేసుకోవడమే మంచిది మాధవీ! పగలు, ద్వేషాలు, కక్షలు తెగేదాకా లాగడం మంచిది కాదు. ఇది నా అభిప్రాయం మాత్రమే. పోలీసులు, కోర్టుల చుట్టూ తిరిగి పరువు పోగొట్టుకోకుండా అతను నిన్ను చేసుకుంటానని ముందుకు వస్తే ఒప్పుకోవడమే మంచిదని నాకనిపిస్తోంది. ఇది కేవలం నా అభిప్రాయం మాత్రమే. ఇలా జరిగి తీరాలని, ఇదే సరైన ముగింపు అని నేను ఖచ్చితంగా చెప్పలేను. నువ్వు ఆలోచించుకో. వస్తాను" అంటూ లేచాను.

మాధవి అయోమయంగా నా వైపు అలా చూస్తుండిపోయింది.

కొన్ని విషయాలు ఆ అమ్మాయికి నేను చెప్పలేదు.

జయరాం నాకు బాగా తెలుసు. వాళ్ళ పేరెంట్స్ కూడా తెలుసు. జయరాం నిజంగా మంచి కుర్రాడు. అందాన్ని ఆరాధించే అతను మాధవిని ప్రాణాధికంగా ప్రేమించాడు. కాని ఆమె చేసిన అవమానం భరించలేక క్షణికోద్రేకంలో అలాంటి చర్యకి పాల్పడినందుకు తర్వాత ఎంతో కుమిలిపోతున్నాడు. సిగ్గుతో చచ్చిపోతున్నాడు. మాధవిని ఆ స్థితికి తెచ్చింది తనే ఆబట్టి అవసరమైతే అమెరికా అయినా తీసుకెళ్ళి ప్లాస్టిక్ సర్జరీ చేయిస్తానని, ఆమె ఇష్టపడితే తను ఆమెని పెళ్ళి చేసుకునేందుకు సిద్ధమేనని నాతో చెప్పాడు. మాధవి తనికి ఎలాంటి శిక్ష విధించినా అనుభవించడానికి తను సిద్ధంగా వున్నానన్నాడు. కాని అవేవీ నేను మాధవికి చెప్పలేదు. దీనికి ముగింపు ఆ అమ్మాయితే వదిలేసి వచ్చేశాను.

❀